## అలరించిన ప్రకృతి ఉత్పత్తుల స్టాల్

**విశాలాంధ్ర-ఆమదాలవలస:** పట్టణంలోని ప్రైవేటు కల్యాణ మండపంలో జీఎస్టీ 2.0పై ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను నక్క చిరంజీవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ స్టాల్లో లభ్యమయ్యే తిరుపతి లడ్డుకు ఉపయోగించే బెల్లం కూరగాయలు ప్రదర్శన పలువురిని ఆకర్షించింది. స్థానిక నాయకులు వ్యాపారులు ప్రకృతి సేద్యం ద్వారా పండించే కూరగాయలను, జీవామృతం ద్వారా చెరకు ఉత్పత్తితో తయారైన బెల్లం నిర్దేశిత ధరలకు విక్రయించారు. వీటిని కొనుగోలు చేసేందుకు ఎగబడ్డారు. ప్రతి సోమవారం కెవికె ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్ ఉందని అక్కడ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తామని నిర్వాహకులు చిరంజీవి తెలిపారు.

## పాపం పసి హృదయం..

**విశాలాంధ్ర-పలాస:** అభం..శుభం.. తెలియని పసి హృదయం.. తల్లికి బరువైంది..ఏ కష్టం వచ్చిందో.. తెలియదు గాని ప్రేగు తెంచుకొని పుట్టిన కన్న బిడ్డను.. వదిలించుకున్న తల్లి గుండె పాషాణం..అయింది. ఈ చిత్రంలో కనిపిస్తున్న చిన్నారిని ఇచ్చాపురం రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తులు విడిచిపెట్టి వెళ్ళిపోయారు. వివరాల్లోకి వెళ్తే ఇచ్చాపురం రైల్వే స్టేషన్ ఫ్లాట్ ఫామ్‌పై మంగళవారం ఉదయం ఓ వెండర్‌కి పాపని చూడమని టాయిలెట్‌కి వెళ్లి వస్తామని ఓ మహిళ అప్పగించి వెళ్ళి పోయింది. ఎంతవరకూ ఎదురు చూస్తున్న రాకపోవడంతో మరో వెండర్ సహకారంతో పలాస రైల్వే స్టేషన్‌లో చైల్డ్ హెల్ప్ డెస్క్‌కు రైల్‌లో తీసుకొచ్చి అప్పగించారు. ప్రస్తుతం చైల్డ్ లైన్ సూపర్ వైజర్లు బాల సరస్వతి భాగ్యలక్ష్మి వద్ద సురక్షితంగా ఉండగా చిన్నారిని శ్రీకాకుళం శిశు గృహానికి తరలించనున్నారు.

## హామీలను అమలుచేశాకే ఏపీలో మోదీ అడుగు పెట్టాలి

- ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొత్స సంతోష్

**విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్:** ఆంధ్రప్రదేశ్‌కి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రానికి మోసం చేస్తున్నారని, ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ఆయనకు ఏపీలో అడుగుపెట్టే అర్హత లేదని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా అధ్యక్షులు బొత్స సంతోష్ అన్నారు. స్థానిక ఎస్ఆర్ దాసరి క్రాంతి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని చెప్పి యువతను మోసం చేశారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయకుండా, విశాఖ ఉక్కును ప్రైవేటీకరణం చేసే దిశగా ఆలోచన చేస్తున్న ప్రధానమంత్రి ఏ విధంగా ఈ నెల 16వ తేదీన కర్నూలు ప్రాంతానికి వస్తారని ప్రశ్నించారు. హామీలను అమలు చేసి రాష్ట్రంలో అడుగు పెట్టాలని, మోదీ వస్తున్న సందర్భంగా ఈనెల 16వ తేదీన గో బ్యాక్ మోదీ నిరసన కార్యక్రమం చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ టౌన్ కన్వీనర్ వై.వేణు, నాయకులు జగదీష్, పద్మ, కమల తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ వసూళ్ల నిలయం.. పంచాయితీ కార్యాలయం..!

పక్కదారి పడుతున్న మందస పంచాయతీ నిధులు..?

**విశాలాంధ్ర - మందస:** మండల కేంద్రమైన మందస మేజర్ పంచాయతీ కార్యాలయం అక్రమ వసూళ్లకు నిలయంగా తయారైందనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. పంచాయతీలో ప్రజా సమస్యలు గాలికి వదిలేసి పూర్తిగా పట్టించుకోక పోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ ప్రతి పనికి ఓ రేటు నిర్ణయించి మధ్య దళారుల ద్వారా కార్యాలయం యంత్రాంగం వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ కలెక్షన్ల మీద ఉన్న శ్రద్ధ పాలనలో కనిపించడం లేదని దీంతో పంచాయతీ పాలన పూర్తిగా గాడి తప్పిందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ పంచాయతీ పరిధిలో 14 వార్డులతో పాటు 15 వేల మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. ఈ పంచాయతీలో మందసతో పాటు చిన్న బరంపురం, మేఘమాల గ్రామాలు ఉన్నాయి. ఈ వార్డుల్లోనూ ఉన్న ఆలయాలకు భక్తులు వెళ్లే దారుల్లో విద్యుత్ స్తంభాలు ఉన్నప్పటికీ సంవత్సరాలు తరబడి స్తంభాలకు విద్యుత్ బల్బులు అమర్చరని కానీ విద్యుత్ బల్బులు కొనుగోలు చేసి పంచాయతీలో వినియోగి స్తున్నట్లు తప్పుడు రికార్డులు నమోదు చేస్తున్నారు. పారిశుద్ధ్య పనులు పూర్తిగా జరగడం లేదు. వీధిలో చెత్తా చెదారంతో నిండి మురికి కాలువల్లో నీరు నిల్వతో కంపు కొడుతున్నాయి. జంగిల్ క్లియరెన్స్ పనులు సక్రంగా జరగకుండానే యంత్రాలు ఉపయోగించినట్లు బిల్లులు డ్రా అవుతు న్నట్టు బయట ప్రచారం జరుగుతుంది. పంచాయతీ పరిధిలో శుద్ధ జలం పంపిణీ చేసే పైప్ లైన్లు కుళాయిలు అక్కడక్కడ పాడైపోయినా పట్టించుకోవడం లేదు. దీంతో శుద్ధ జలం నీరు ప్రతి రోజు రోడ్ల మీదుగా వృధాగా పోతుంది. సబ్ రిజిస్టర్ కార్యాల యాల్లో జరిగే క్రయవిక్రయాలకు సంబంధించిన పొజి షన్ సర్టిఫికెట్ మంజూరు కోసం పదివేల రూపాయలు అక్రమంగా వసూళ్లు చేస్తున్నారు. అంతే కాకుండా విద్యుత్ మీటరు ఇంటి యజమానికి కావాలంటే 5000 రూపాయలు లంచం చెల్లిస్తే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌ను మంజూరు చేస్తున్నారు. ప్రభుత్వ పరంగా స్థానిక పంచాయతీ స్థల వివాదాలకు సంబంధించి పలు న్యాయస్థానాల్లో దీర్ఘకాలికంగా అనేక కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ కేసులను లెక్కచేయకుండా చట్ట విరుద్ధంగా ఇటీవల గృహ సముదాయాలకు షాపులకు విద్యుత్ మీటర్లు మందస మెయిన్ రోడ్‌లో మంజూరు కోసం సంబంధిత యజమానులకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లను పంచాయతీ అత్యంత రహస్యంగా మంజూరు చేశారని తెలుస్తోంది. గతంలో వీరికి విద్యుత్ సరఫరా లేకుండా పంచాయతీ విద్యుత్ శాఖపై ఒత్తిడి తెచ్చి చేసిన సంగతి అందరికీ తెలిసిందే. రెండున్నర సంవత్సరాల కిందట ఈ భవనాలు ప్రభుత్వ స్థలంలో ఉన్న అంటూ విద్యుత్ సరఫరాను అప్పట్లో విద్యుత్ శాఖ వారు నిలిపివేశారు. మళ్లీ ఇప్పుడు విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించి వారి నుంచి లక్షల్లో లంచాలు వసూలు చేసినట్టు ప్రచారం జరుగుతుంది. కాగా స్థానిక సర్పంచ్‌కు తెలియకుండా పంచాయతీకి సంబంధించిన ఖర్చులు చేస్తున్నట్టు ఈవో రికార్డులు తయారు చేయడం పట్ల కార్యాలయంలో పంచాయతీలో తీవ్ర చర్చ జరుగుతుంది. గతంలో వార్డుల పరిధిలో విద్యుత్ స్తంభాలకు విద్యుత్ బల్బులు వేయడానికి స్థానికంగానే పంచాయతీ ఏళ్ల తరబడి కొనుగోలు చేసింది. విద్యుత్ బల్బులకు కొరత లేకుండా పంచాయతీ గతంలో చర్యలు చేపట్టింది. కానీ ప్రస్తుతం ఈవో సరికొత్త చర్యలకు శ్రీకారం చుట్టి విద్యుత్ బల్బులు కొరతను ఇక్కడ సృష్టిస్తున్నారని వార్డ్ మెంబర్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా మరణ, జనన ధ్రువీకరణ పత్రాలు ఇక్కడ మంజూరు చేయాలన్న భారీ స్థాయిలో డబ్బులు చెల్లించాల్సి ఉండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని సమగ్రమైన దర్యాప్తు జరిపి పంచాయతీ పాలన సక్రమంగా జరిగేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ఉరుములు, మెరుపులు సమయంలో గ్రానైట్ బ్లాస్టింగ్ చేయొద్దు: కలెక్టర్

**విశాలాంధ్ర-శ్రీకాకుళం:** ఉరుములు, మెరుపులు ఉన్న సమయంలో గ్రానైట్ బ్లాస్టింగ్ చేయరాదని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చెప్పారు. గ్రానైట్ ఇండస్ట్రీస్‌పై గ్రానైట్ యాజమాన్యంతో మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గ్రానైట్ ఇండస్ట్రీలో భద్రత, రక్షణ ముఖ్య మన్నారు. కార్మికుల భవిష్యత్తుకు భరోసాగా గ్రూపు ఇన్సూరెన్సు ఉండాలన్నారు. గ్రానైట్ పేల్చడం వలన చాలా ప్రమాదాలు సంభవిస్తున్నట్లు చెప్పారు. బ్లాస్టింగ్ చేసే సమయంలో నిబంధనలు పాటించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రానైట్ ఇండస్ట్రీస్‌పై ట్రైనింగ్ సెంటర్‌కు భూమి కేటాయిస్తానన్నారు. ఈఎస్ఐలో ఉంటే అంతా కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ దినేష్ కలెక్టర్‌కు వివరించారు. ఈఎస్ఐ పెట్టుకొనేందుకు డిశంబరు 31 వరకు సమయం ఉన్నట్టు చెప్పారు. గ్రానైట్ కార్మికుల కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. వొకేషనల్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు 10 సెంట్లు భూమి కావాలని గ్రానైట్ అసోసియేషన్ కోరగా పది సెంట్ల భూమి ఇవ్వాలని టెక్కలి ఆర్డీఓను కలెక్టర్ ఆదేశించారు. ట్రైనింగ్ సెంట ర్‌లో అవసరమైన శిక్షణ ఏర్పాట్లు అసోసి యేషన్ వారే అంతా చూసుకోవాలని చెప్పారు. రికమండేషన్ ఉండరాదని చెప్పారు. లైసెన్సులు లేని క్రషర్స్ ఉంటే ఆపివేయాలన్నారు. నిబంధనల ప్రకారం చేయా లన్నారు. వాతావరణ కేంద్రం జారీ చేసిన వాతావరణ పరిస్థితులు ఆధారంగా తక్షణమే సైరన్ వేయాలని చెప్పారు. ఇందుకు ఒక వ్యక్తిని ఏర్పాటు చేసుకో వాలని చెప్పారు. తహసీల్దార్లకు పలు సూచనలు జారీ చేశారు. భూ గర్భగనులు శాఖ ఉప సంచాల కులు మోహనరావు మాట్లాడుతూ గ్రానైట్ కార్మికులకు కార్మిక శాఖ భీమా కల్పించడం, హెల్మెట్ ఉండాలని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, పోలీసు శాఖ నుండి అనుమతులు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం జిల్లా లోని క్వారీల యజమానులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కరుణ శ్రీ, అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి మోహనరావు, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ దినేష్, శ్రీకాకుళం, టెక్కలి, పలాస ఆర్డీఓలు కె. సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, వెంకటేష్, డిఎస్పీ వివేకానంద, భూ గర్భ గణులు శాఖ అసిస్టెంట్ జియాలజిస్టులు హర కుమార్ నాయుడు, కే.రాము, సంబంధిత మండలాల తహసీల్దార్లు, భూగర్భ గనుల శాఖ రాయల్టి ఇన్‌స్పెక్టర్‌లు మాణిక్యాలరావు, గణేష్ సాంకేతిక సహాయకులు నాగేంద్ర పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆదేశాలతో జంగిల్ క్లియరెన్స్

**విశాలాంధ్ర-కవిటి:** కవిటి మండలం ఇద్దివానిపాలెం గ్రామం నుంచి బొరివంక సమీపంలోని కొత్త ఎన్టీఆర్ కాలనీ వరకు రోడ్డుకు ఇరువైపుల పిచ్చి మొక్కలు దట్టంగా పెరగడంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, బస్సుకి ఇబ్బందిగా ఉండడంతో ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ ఆదేశాలు మేరకు ఎంపీడీవో ఎల్.త్రినాథ్ ఆధ్వర్యంలో జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు వి.పురుషోత్తం, సొసైటీ అధ్యక్షులు ఉప్పాడ రామారావు, త్రినాథ్, పున్నాలు తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్టీ ప్రాప్తికి సిమెంటు విక్రయించాలి

**విశాలాంధ్ర-కవిటి:** ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన జీఎస్టీ ప్రాక్తికి సిమెంటును విక్రయించాలని ఎంపీడీవో ఎల్.త్రినాథ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం కవిటిలో ఎంపీడీవో ఆధ్వర్యంలో సిమెంటు, గృహ పరికరాల దుకాణాల వద్ద జీఎస్టీపై వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ షాపు ముందు జీఎస్టీ తగ్గుంపు ధరల బోర్డు ఉంచాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాస రెడ్డి, ఏపీవో టి. మోహనరావు, ఎస్బీఎం కోఆర్డినేటర్ సల్ల జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్జీయూకేటీ విద్యార్థులకు నైపుణ్య పరీక్ష

**విశాలాంధ్ర-ఎచ్చెర్ల:** ఆర్జీయూకేటీ పరిధిలోని శ్రీకాకుళం, కడప, నూజివీడు, ఒంగోలు క్యాంపస్ లోని ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు వారిలో నైపుణ్య పరీక్ష టీవీఎస్టిఎస్ సంస్థ సహకారంతో స్కిల్ సెన్సస్ -2025 పరీక్ష నిర్వహిస్తున్నట్టు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ డాక్టర్ సంద్ర అమరేంద్రకుమార్ అన్నారు. రెండు రోజుల పాటు విద్యార్థులకు నైపుణ్య పరీక్ష నిర్వహించి వారిలో లోపాలు వాటి అంతరాన్ని గుర్తించి పూరించేందుకు శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. దీని వల్ల ఎక్కువ మంది విద్యార్థులు ఉద్యోగావకాశాలు పొందుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో డాక్టర్ ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ డాక్టర్ ఎం.శివరామకృష్ణ, స్కిల్ సెన్సస్ సమన్వయకర్త కె. దిలీప్కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## సకాలంలో అందని వైద్యం..వృద్ధురాలి మృతి

**విశాలాంధ్ర - సంతబొమ్మాలి:** వైద్యాధికారులు సమ్మె చేస్తుండడంతో సకాలంలో వైద్యం అందక సంతబొమ్మాలి మండలం నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం సాయంత్రం దుర్గాసి సావిత్రి (63) అనే వృద్ధురాలు అస్వస్థతకు గురై మృతి చెందింది. వివరాల్లోకి వెళితే పాత లింగూడు గ్రామానికి చెందిన సావిత్రి నౌపడ గ్రామానికి చెందిన బంధువుల ఇంట్లో ఆదివారం జరిగే కార్యక్రమానికి వచ్చింది. మంగళవారం నీరసంగా ఉందని నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్యం చేయించుకుంది. డాక్టర్లు సమ్మెలో ఉండటం వలన సిబ్బంది ఆమెకు టాబ్లెట్లు ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇచ్చారని బంధువులు తెలిపారు. ఇంటికి వచ్చిన ఆమె స్పృహ కోల్పోయింది. స్పృహ కోల్పోయిన ఆమెను బంధువులు వెంటనే ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడ ఉన్న సిబ్బంది తక్షణమే వైద్యం అందించి సిపిఆర్ చేసి, సమ్మెలో ఉన్న వైద్యాధికారిణుల ఆధ్వర్యంలో అలాగే ఆసుపత్రికి నియమించిన ప్రత్యేక విద్యాధికారిణి సలహాలతో వైద్యం అందించినప్పటికీ ఆమె ప్రాణాలు దక్కలేదు. సమ్మెలో ఉన్న వైద్యాధికారులు ఆధ్వర్యంలో వైద్య చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం టెక్కలి తీసుకెళ్లేందుకు 108 వాహనం కోసం వేచి చూసేలో ఆమె మరణించింది. ఆమెకు సరైన సమయానికి నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది స్పందించి తక్షణమే వైద్యం అందించినా సావిత్రమ్మ మృతి చెందిందని కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. సమ్మెలో ఉన్న మానవత దృక్పథంతో తక్షణమే స్పందించిన వైద్యాధికారిణులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

**సమయ పాలన పాటించని స్టాఫ్ నర్స్**

ఇదిలా ఉండగా నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి స్టాఫ్ నర్స్‌ల కొరత ఉంది. అయితే ఉన్న ఇద్దరు స్టాఫ్ నర్స్‌లను ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఒకరిని, సాయంత్రం 6 గంటల నుంచి మరొకటి రోజు ఉదయం 8 గంటల వరకు ఒకరిని విధులు నిర్వహించాలని వైద్యాధికారులు డ్యూటీ చార్ట్ నియమిం చినట్లు తెలుస్తోంది. అయితే 6 గంటలకు రావాల్సిన స్టాఫ్ నర్స్ సుమారుగా గంట ఆలస్యంగా రావడం విశేషం. జిల్లా వైద్యాధికారులు సిబ్బంది సమయపాలన పాటించాలని, మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఆసుపత్రిలో సిబ్బంది సమయపాలన పాటించకపోవడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా వైద్యాధి కారులు స్టాఫ్ నర్సుల కొరత లేకుండా చూడాలని సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## విశాఖలో ఏఐ గూగుల్ హబ్

- రాష్ట్రానికి చారిత్రాత్మక మైలురాయి
- యువతకు 1.88 లక్షల ఉద్యోగాలు
- బాణాసంచా కాల్చి ప్రభుత్వానికి సంఘీభావం

**విశాలాంధ్ర - ఆమదాలవలస:** విశాఖపట్నంలో గూగుల్ ఏఐ హబ్బుతో ఒక గిగావాట్ హైపర్ స్కిల్ డేటా సెంటర్ క్యాంపస్ ఏర్పాటుకు ఢిల్లీలో ఒప్పందం కుదుర్చుకున్న వేళ యువతకు 1,88 వేల ఉద్యోగాలు రాను న్నాయని స్థానిక ఎమ్మెల్యే పియుసి చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. మున్సిపల్ కార్యాలయ జంక్షన్ రోడ్లు బాణాసంచా కాల్చి సంఘీభావం తెలిపారు. ఐటీ రంగా అభివృద్ధికి ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో ప్రపంచంలో ఎక్క డా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్లోని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ హబ్ ఏర్పాటు చేయటం ఆసియా ఖండంలోని అతి పెద్ద క్యాంపస్ అని అన్నారు. గూగుల్ సంస్థ విశాఖలో 87,500 కోట్ల పెట్టుబడతో అతి పెద్ద డేటా సెంటర్ క్లస్టర్ను నిర్మించ బోతోంది అన్నారు. ఇది రాష్ట్ర అభివృద్ధి దిశలో చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుంది అన్నారు. రాష్ట్రంలో పారదర్శక విధానాలు, సింగిల్ విండో సిస్టం మానవ వనరుల లభ్యత వలన, ప్రపంచ టెక్ దిగ్గజాలు ఏపీ వైపు దృష్టిసారిస్తున్నయని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయ కత్వంలో ఆంధ్రప్రదేశ్ మరోసారి టెక్నాలజీ విప్లవానికి నాంది పలకనుంది. అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్న ఉద్దే శంతో ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు కూటమి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ను అగ్ర గామిగా ఉంచేందుకు చేస్తున్నారని వివ రించారు. యువత ఉజ్జల భవిష్యత్తుకు పరిశ్రమల రాకతో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని వివరించారు. హైద రాబాదుని మించిన ఐటీ హబ్ గా విశాఖపట్నం తీర్చిదిద్దా లన్న కృతనిత్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో కంపెనీలు ఏర్పాటు జరుగుతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల హామీని నెరవేర్చడంలో భాగంగా కంపెనీలు స్థాపన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

## బాధ్యతగా పని చేసి ఉత్తమ ఫలితాలు సాధించాలి

**విశాలాంధ్ర-కవిటి:** విధుల్లో చేరిన కొత్త ఉపాధ్యాయులు బాధ్యతగా పని చేసి ఉత్తమ ఫలితాలు సాధనకు కృషి చేయాలని ఏపీ విద్యా పరిశీలకులు పుల్లట రమేష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన రాజపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కెమిస్ట్రీ ల్యాబ్, ఆట స్థలం, డ్రింకింగ్ వాటర్, కిచెన్ గార్డెన్, వర్షపు నీరు ఒడిచిపట్టడం, మరుగుదొడ్లు, లైబ్రరీ రూమ్, బయాలజీ లాబ్ తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులకు శు భాకాంక్షలు తెలిపి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వెంకటరమణ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## నాదెండ్లను కలిసిన బాలమురళి

**విశాలాంధ్ర - ఆముదాలవలస:** ఇటీవల జిల్లా పర్యటనకు విచ్చేసిన జనసేన పార్టీ రాజకీయ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను మండల జనసేన నాయకుడు వీరఘట్టం బాలమురళి మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ బొలోపేతానికి కృషి చేయాలని వివరించినట్లు బాలమురళీ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని వివరించినట్లు తెలిపారు. భవిష్యత్తు నాయకులుగా జనసైనికులను తీర్చిదిద్దామని మంత్రి హామీ ఇచ్చారని అన్నారు. విస్తృత సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రిని కలిసి స్థానిక పరిస్థితులను బాల మురళి వివరించారు.

## సచివాలయ ఉద్యోగులు జవాబుదారీగా ఉండాలి

ఎమ్మెల్యే గౌతు శిరీష

**విశాలాంధ్ర - పలాస:** పలాస నియోజకవర్గంలో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలని, ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో నియోజవర్గ స్థాయి సచివాలయ ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉద్యోగులంతా ప్రజలకు అందుబాటులో ఉండి వారికి ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. మీ పరిధిలో కాకుండా ఉండే సమస్య అయితే ఎక్కడ పరిష్కారం అవుతుందో వారికి సామరస్యంగా వివరించాలన్నారు. అదే విదంగా ప్రజా ప్రతినిధులు ఏ పార్టీకి చెందిన వారు అయినా అందరికి సమాచారం అందించి ముఖ్యంగా ప్రోటోకాల్ పాటించాలన్నారు. సచివాలయాలలో 40 శాతం ఉద్యోగుల కొరత ఉందని వాటిని పరిష్కరించే విదంగా చర్యలు తీసుకుంటానన్నారు. ఉద్యోగులు పనిచేస్తుంటే వారికి ఇబ్బందులకు గురుచేస్తున్న వారు ఉంటే నేరుగా తనకు సమాచారం అందించాలన్నారు. ఉద్యోగులు కూడా ప్రజలు ఫిర్యాదులు పరిష్కరించి మంచి పేరు తెచ్చుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో ఎపిటిసిసి చైర్మన్ వజ్జ బాబూరావు, ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, పి.విఠల్, గాలి క్రిష్ణారావు, కమీషనర్ ఎన్.రామారావు, ఎంపిడిఓ కె.వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఐతమ్ విద్యార్థుల ప్రతిభకు గుర్తింపు

**విశాలాంధ్ర - టెక్కలి:** మండలంలోని ఐతమ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల జరిగిన ప్రాంగణ ఎంపికలలో సిఎస్ఈ, ఈసిఈ విభాగాలకు చెందిన ముగ్గురు ఇంజనీరింగ్ విద్యార్థులు తమ సాంకేతిక చతురతతో ప్రముఖ ఐటి రంగ సంస్థలైన పాల్టెక్, యూనిస్ట్రింగ్ టెక్ సొల్యుయేషన్ లలో 6లక్షలు రూపాయలు ప్రథమ వార్షిక వేతన ప్యాకేజీతో ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వివి నాగేశ్వరావు తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఈ విజయాలు ఐతమ్ అందిస్తున్న నాణ్యతా విద్య, సాంకేతిక శిక్షణా ప్రమాణాలకు నిదర్శనం అని కొనియాడారు. ప్రపంచస్థాయి ఐటీ సంస్థల్లో విద్యార్థులు ఉద్యోగాలు పొందడం గర్వకారణంగా భావించారు. ఎంపికైన విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎఎస్ శ్రీనివాసరావుతో పాటు ఆయా విభాగాల హెచ్ఒడిలు డా. వై.రమేష్, డా. అశోక్ కుమార్, డీన్ ప్లేసెమెంట్ డా. ఎం.సంతోష్ కుమార్ తదితరులు అభినందించారు.

## నకిలీ మద్యం మాఫియాకు అండగా కూటమి

- ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేది కూటమి నాయకులే...
- ఎక్సైజ్ శాఖ మంత్రిని వెంటనే బర్తరఫ్ చేయాలి
- టెక్కలి నియోజకవర్గంలో అన్ని బెల్టు దుకాణాలకు ఒకరే...వారే కింజరాపు ప్రసాద్
- ప్రతి వ్యవస్థలో బినామీలుగా కింజరాపు కుటుంబం..
- నకిలీ మద్యంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: వైసిపి నేత పేరాడ



**విశాలాంధ్ర - టెక్కలి:** నకిలీ మద్యం మాఫియాకు అండగా కూటమి ప్రభుత్వం నాయకులే ఉన్నారని వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ పేరాడ తిలక్ అన్నారు. మండలంలోని స్థానిక వైసీపీ పార్టీ కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పేరాడ తిలక్ మాట్లాడుతూ ఏరులై పారుతున్న నకిలీ మద్యంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్ర ఆదాయానికి గండి కొడుతూ సొంత ఆదాయాన్ని పెంచుకోవడం కోసం అమాయకమైన ప్రజలను నకిలీ మద్యంతో మోసం చేస్తూ ఎంతోమంది ప్రాణాలను బలి తీసుకుంటున్నా రన్నారు. రాష్ట్రంలో ఇబ్రహీంపట్నం, ఏలూరు, మచిలీపట్నం, అనకాపల్లి, శ్రీకాకుళం లలో పెద్ద ఎత్తున అక్రమ మద్యం తయారు అవుతుందన్నారు. అక్రమ మద్యం తయారు చేసి రాష్ట్ర ఆదాయానికి గండి కొడుతూ టీడీపీ పార్టీ నాయకులకి ఇది ఒక పెద్ద కుటీర పరిశ్రమలా, ఆదాయ మార్గంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన బీ ఫాం మీద పోటీ చేసిన వ్యక్తి ఈ కల్తీ మాఫియాలో ప్రధాన సూత్రధారిగా ఉన్నారని మరి అతనికి ఇంతవరకు మీరు ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. నకిలీ మద్యం కోసం ప్రజలకు అవగాహన కల్పిస్తుంటే వైసీపీ నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. నకిలీ మద్యానికి ప్రోత్సహిస్తున్న ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లి రవీంద్రని వెంటనే బర్తరఫ్ చేయాలని ఆయన కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో నాలుగు నుండి ఐదు బెల్ట్ షాపులు ఉన్నాయని దీనిపై ఆ శాఖకి సంబంధించిన మంత్రి రవీంద్ర సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. టెక్కలి నియోజకవర్గం లో నకిలీ మద్యం వ్యవస్థ ఒక చరిత్రనని అన్నారు. నాలుగు మండలాలకు సంబంధించిన మద్యం దుకాణాలు మొత్తం ఒకరే నడుపుతున్నారని, అన్ని దుకాణాలను సిండికేట్ చేసి కింజరాపు ప్రసాద్ పూర్తిగా సారథ్యం వహిస్తున్నారని అన్నారు. దీనికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్ని రకాలుగా ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో మద్యం సేవిస్తున్న ప్రజలు కల్తీ మద్యంపై ఇప్పటికైనా అప్రమత్తంగా ఉండి ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పాలని తెలిపారు. ఈ నకిలీ మద్యంపై సిబిఐ విచారణ చేపట్టాలని తిలక్ డిమాండ్ చేశారు.

## బీఆర్ఏయూలో క్యాంటిన్ నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలోని క్యాంటీన్ నిర్వహణకు ఆసక్తి గలవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. అడ్డయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 25వ తేదీ వ ధ్యాహ్నం 3 గంటల్లోగా రిజిస్ట్రార్ కార్యాలయానికి దరఖాస్తు అందజేయాలన్నారు. దీనికి సంబంధించి దరఖాస్తు ఫారం వర్సిటీ వెబ్సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ బీఆర్ఏయూ డాట్ ఈడీయూ డాట్ ఇన్ వెబ్సైట్లో అందుబాటులో ఉందన్నారు. మరింత సమాచారం కోసం వర్సిటీ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నేరుగా కాని, 98662 99401, 9989340933కు సంప్రదించాలన్నారు.

## రాజ్యమేలుతున్న మార్వాడి వ్యాపారులు...

**- నాణ్యత లేని నాసిరకం వస్తువులు అమ్మకాలు..**
**- చత్తీస్ఘడ్, కోల్‌కత్తా కేంద్రాలుగా దిగుమతులు..!**

**విశాలాంధ్ర-పలాస :** మన రాష్ట్రం నుండి పక్క రాష్ట్రానికి వెళ్లి వ్యాపారాలు చేసుకోలేని మనం.. ఇతర రాష్ట్రాల నుండి మన ప్రాంతానికి వచ్చి వ్యాపారాలు చేసుకుంటున్న వారిని సహకరిస్తుంటాం. వారి వ్యాపార అభివృద్ధికి తోడ్పడుతుంటాం..కానీ వినియోగదారులకు వారు చేసే మోసంను తెలుసుకోలేకపోతున్నాం. పలాస కాశీబుగ్గలో దశాబ్దాల కిందట ఓకే ఒక ఎలక్ట్రికల్ షాప్ ఉండగా నేడు జంట పట్టణాల్లో అనేకమంది రాజస్థానీ మార్వాడి వ్యాపారులు ఎలక్ట్రికల్ పరికరాల అమ్మకాల పేరుతో పాగా వేశారు. 15 ఏళ్ల కిందట రాజస్థాన్ నుండి ఒక మార్వాడి కుటుంబం కాశీబుగ్గ ప్రాంతానికి వచ్చి ఎలక్ట్రికల్ షాప్ ను ప్రారంభించిన అనతి కాలంలోనే సుమారు 20 షాపుల వరకు మార్వాడీలు విస్తరించడంతో పాటు వ్యాపారాల్లో అభివృద్ధి చెంది శాశ్వత చిరునామాగా ఈ ప్రాంతాన్ని మార్చుకోవడం విస్తుగోల్పుతోంది. ఉత్తరాంధ్ర జిల్లాల వాసులు కూలీలుగా ముద్రపడి దూర ప్రాంతాలకు వలసలు పోయి చెమటోడ్చి కుటుంబాలను పోషించుకుంటున్న తరుణంలో శ్రమ జీవుల రక్తాన్ని పిండేస్తున్న కొంత మంది మార్వాడి వ్యాపారులు.. వారి బ్రోకర్లు చేస్తున్న అరాచక అక్రమాల కథనం ఇది. జిల్లాలలో రాజ్యమేలుతున్న కొంతమంది రాజస్థానీ మార్వాడి వ్యాపారులు పలాస కాశీబుగ్గ పట్టణాలలో అన్ని వ్యాపారాల్లో కొనసాగుతుండడం విశేషం. ముఖ్యంగా ఎలక్ట్రికల్, హార్డ్ వేర్, పెయింట్స్ చివరకు రోడ్డు పక్కన అమ్మే తినుబండారాల వరకు వీరి ప్రమేయం లేనిదే మార్కెట్ లేదనే స్థితికి తీసుకువచ్చారు. మరో విశేషం ఏమిటంటే కాశీబుగ్గ పెట్రోల్ బంకు వెనుక వీరి పేరుతో ఒక కాలనీ సొంతంగా ఏర్పడింది. గతంలో స్థానిక వ్యాపారులు వినియోగదారుల అవసరాలను కనుగొని వారి జీవన ఆర్థిక పరిస్థితులు గమనించి నాణ్యమైన వస్తువులను విక్రయించేవారు. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. బ్రోకర్లే తమ వ్యాపార అభివృద్ధికి ముఖ్యమని భావించి ఆయా బ్రోకర్లకు పర్సెంటేజీలు చెల్లించి ఛత్తీస్ ఘడ్ రాష్ట్రం రాయపూర్, కలకత్తా నుంచి నెంబర్ టు వస్తువులను ఇక్కడకు దిగుమతి చేసుకొని అమ్ముతూ వినియోగదారులకు కుచ్చుటోపి పెడుతున్నారు. వీరి వద్ద కొనుగోలు చేసిన ఏ వస్తువు కూడా క్వాలిటీ లేదని అది మున్నాళ్ళ ముచ్చటగా మిగిలిపోతుందని పలువురు వినియోగదారులు వాపోతున్నారు. ఇక్కడ విశేషమేమిటంటే రెండో రకం వస్తువులతో కోట్లాది రూపాయలు వ్యాపారాలు చేసుకుంటున్న మార్వాడీలు ప్రభుత్వానికి ఒక్క పైసా కూడా పన్ను చెల్లించరని సమాచారం. ఎలక్ట్రికల్ కంపెనీలకు సంబంధించి రాయపూర్ లో డూప్లికేట్ గా తయారైన గోల్డ్ మోడల్ కంపెనీ పేరుతో ఎలక్ట్రికల్ వస్తువులు అమ్ముతున్నారు. ఇది అసలు గోల్డ్ మెడల్ కంపెనీ ధర కన్నా తక్కువ ధరకు విక్రయిస్తుండడంతో బ్రోకర్ల మాయ పడిన వినియోగదారులు నష్టపోతున్నారు. దీంతో అసలు సిసలు కంపెనీ వస్తువులు అమ్మే వ్యాపారులు డూప్లికేట్ వస్తువులు అమ్మే వ్యాపారులతో పోటీ పడలేక కుదేలవుతున్నారు. వీరు చేస్తున్న ఈ అక్రమ అనాలోచిత వ్యాపారంతో స్థానికంగా ఉన్న వ్యాపారులకు కూడా చెడ్డ పేరు వస్తుందని తెలుస్తోంది. ఈ వ్యాపారులు ఉదయం ఏడు గంటలకు దుకాణాలు తెరిచి రాత్రి 11:00 వరకు కూడా తమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. వీరికి ఎటువంటి నిబంధనలు వర్తించవు. దీనిపై అధికారులు కూడా దృష్టి సారించడం లేదు. వీరి అక్రమ వ్యాపార దందాకు ప్రధానంగా కొన్ని ఉదాహరణలు చెప్పుకోవాల్సి వస్తే గోల్డ్ మెడల్ కంపెనీకి చెందిన వన్ బై ఎయిటీన్ వైరు అసలు ధర రూ. 1150 కాగా అదే పేరుతో వీరు అమ్ముతున్న రెండో రకం క్వాలిటీ 800 రూపాయలుగా ఉంటుంది. అలాగే హార్డ్ వేర్ షాపుల్లో వారు విక్రయిస్తున్న సామానులపై ఎమ్మార్పీ ధర కూడా ఉండదు . వారు చెప్పిన ధర మాత్రమే వేదం దీని వలన మార్వాడి వ్యాపారులు నియమించుకున్న బ్రోకర్ లు మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నారు. అంతేకాకుండా వీరికొక యూనియన్ కూడా ఉంది. వారు నెలవారి జరుపుకుంటున్న సమావేశంలో వారు ప్రకటించిన ధరలకే అమ్మాలని ఎజెండాగా పెట్టుకొని వినియోగదారులను నిండా ముంచుతున్నారని ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇలాంటి నాసిరకము వ్యాపారులు చేస్తున్న మార్వాడీలపై సంబంధిత అధికారులు దాడులు నిర్వహించాలని వినియోగదారులు కోరుతున్నారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ కూటమి ప్రభుత్వ బాధ్యతా రాహిత్యం

**- ప్రైవేటీకరణను అడ్డుకుని తీరతాం**
**- ప్రజా ఉద్యమంతో ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి**
**- విద్య, వైద్య రంగాల్లో పేదలకు నష్టం జరుగుతుంటే చూస్తూ ఊరుకోం**
**- మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు**

**విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ :** మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ పేరుతో ప్రజలను ప్రైవేటు ఆస్పత్రులకు బలిచ్చే కార్యక్రమం వెంటనే ఆపాలని, ఇది కూటమి ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలను ప్రైవేటు యాజమాన్యాల కిందకు తీసుకువెళ్ళి, విద్యార్థులు, పేదల జీవితాలతో చెలగాటం ఆడేందుకు కూటమి సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రజా పోరాటంతోనే అడ్డుకుంటామని స్పష్టం చేశారు. బాధ్యతారహితంగా ఈ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సర్కార్ మెడలు వంచి, దానిని ఉపసంహరించుకునే వరకు వెనకడుగు వేయబోమన్నారు. ప్రజారోగ్యాన్ని బలిపీఠం మీద పెడితే బాధ్యతయుతమైన ప్రతిపక్షంగా సహించేది లేదన్నారు. ప్రజల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యతగా భావించాలి కానీ చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసి నాణ్యమైన వైద్యం పొందే పేదవాడి హక్కును కాలరాసిందన్నారు. ఉచిత వైద్యాన్ని అందని ద్రాక్షగా మార్చేశారని, దీనిపై ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాల్లోనూ తీవ్రమైన చర్చ జరుగుతోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రపంచ వ్యాప్తంగా కరోనా మహమ్మారి విలయ తాండవం చేసినా రాష్ట్రంలోని వైయస్ జగన్ నేతృత్వంలో సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజల ప్రాణాలను కాపాడగలిగామని, నాడు కరోనా విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొన్న రాష్ట్రం ఏపీ మాత్రమేనని అన్నారు. ప్రజారోగ్యం, సమస్యల పరిష్కారం పట్ల వైయస్ జగన్‌కి ఉన్న చిత్తశుద్ధిని దేశం మొత్తం చూసిందని, ఆయన స్పందించిన తీరుకు ప్రపంచ నలుమూలల నుంచి ప్రశంసలు అందుకున్నారన్నారు. కరోనా భయాన్ని అడ్డం పెట్టుకుని ప్రైవేటు ఆస్పత్రులు ప్రజలను దోచుకుంటున్న తరుణంలో ఉచితంగా వైద్యం అందించి కరోనాను ఎదుర్కోవడంలో ప్రభుత్వ ఆస్పత్రులు పోషించిన పాత్ర గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే అన్నారు . నాణ్యమైన ఉచిత వైద్యం అందించడం ప్రభుత్వ బాధ్యత అని, నాణ్యమైన వైద్యం కోరుకోవడం రాష్ట్ర ప్రజల ప్రాథమిక హక్కు అని వాటిని కూడా నెరవేర్చడంలో ఈ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, 16 నెలల పాలనతోనే స్పష్టమైందన్నారు. ప్రతి పేదవాడికి ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించాలన్న గొప్ప లక్ష్యంతో నాటి సీఎం వైయస్ జగన్ 17 కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టి ఏడు కాలేజీలను పూర్తి చేశారన్నారు. రూ. 500 కోట్ల నిర్మాణ వ్యయంతో 50 ఎకరాల విస్తీర్ణంలో మెడికల్ కాలేజీతోపాటు టీచింగ్ హాస్పటల్స్‌ను ఏర్పాటు చేయడం

జరిగిందన్నారు. ఏ, బీ, సీ మూడు కేటగిరీల్లో ఫీజులు నిర్ణయించి, 50 శాతం సీట్లకు కేవలం రూ. 15వేల ఫీజు నిర్ణయించారన్నారు. కూలీ నాలీ చేసుకుని పేదలు కూడబెట్టుకుంటున్న సొమ్మంతా అనారోగ్యం పేరుతో ప్రైవేటు ఆస్పత్రులు దోచుకుంటుంటే చోద్యం చూడటం చాలా తప్పని, దాన్ని అరికట్టడానికి చర్యలు తీసుకోకుండా ప్రభుత్వమే ప్రజారోగ్యాన్ని తీసుకెళ్లి ప్రైవేటు ఆస్పత్రుల చేతుల్లో పెట్టడమంటే ఇది ఇంకా పెద్ద నేరమన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో విద్య, వైద్య రంగాలకు ఎంత ప్రాధాన్యం ఇచ్చారో శత్రువులైనా అంగీకరించక తప్పదని, ఈ రెండు రంగాల్లో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన ఘనత వైయస్ జగన్‌కే దక్కుతుందన్నారు. నాడు - నేడు ద్వారా కొత్త పీహెచ్‌సీల నిర్మాణం, పాత ఆస్పత్రుల ఆధునికీకరణ, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, ఆరోగ్య ఆసరా, గ్రామాల్లో హెల్త్ క్లీనిక్‌ల నిర్మాణం వంటి వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. భూగర్భ జలాలు తాగడం వల్లే కిడ్నీ సమస్య వస్తుందన్న వైద్యుల సూచనతో మంచినీటి సమస్య పరిష్కారం కోసం రూ. 800 కోట్లతో హిరమండలం రిజర్వాయర్ నుంచి నీరు తీసుకొచ్చి సర్ఫేస్ వాటర్ అందించారన్నారు. వైద్య రంగాన్ని ప్రైవేటుపరం చేయాలని చూస్తున్న కూటమి సర్కార్ తీరును ప్రజా ఉద్యమాలతో ఎండగడటామన్నారు.

## ఇప్పటికైనా మా భూములు మాకు ఇప్పించండి..

**- ఆక్రమణ దారుల నుండి రక్షించండి**
**- దూసి దళిత కుటుంబాల ఆందోళన**
**- కలెక్టర్‌కు ఫిరాత్యదు చేసిన దూసి దళిత సంఘం**

**విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ :** గడిచిన నాలుగు సంవత్సరాలుగా ఆక్రమణ దారుల కబ్జాకు గురైన డి.పట్టా భూములను ఇప్పటికైనా మాకు ఇప్పించండి అంటూ ఆమదాలవలస మండలం దూసి గ్రామానికి చెందిన 17 దళిత కుటుంబాలకు చెందిన వారు సోమవారం డి ఆర్ ఓ ఎం వెంకటేశ్వరరావుకు పి.జి.ఆర్.ఎస్‌లో ఫిర్యాదులు చేసారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులు మాట్లాడుతూ 2001లో నాడు టిడిపి ప్రభుత్వం హయాంలో దళితవర్గాలను గుర్తించి, దూసి గ్రామం దగ్గరలో సర్వే నెంబర్ 61-2బిలో 0-11 సెంట్లు చొప్పున స్థలమును ఒక్కో దళిత కుటుంబానికి చెందిన వారికి 27 కుటుంబాల వారికి డి, పట్టాలను అందజేశారన్నారు. ఆర్ సి నెంబర్ 540/2000 ప్రకారం ఒక్కొక్క సభ్యునికి అందజేసిన డిపట్టాను టిడిపి అప్పగించిన నాటినుండి ప్రభుత్వం అప్పగించిన భూమిలో వ్యవసాయ సాగు చేస్తూ, జీడి, మామిడి, వరి, ఇతర మొక్కలను వేసుకుంటూ జీవిస్తున్నట్లు తెలిపారు. ఇంతలో కరోనా వైరస్ రావడంతో సాగు చేసే భూమి వైపు వెళ్లకపోవడం, మరోవైపు నాగావళి నీటి ప్రవాహం అనేకసార్లు భూమి పైకి రావడంతో సాగు పనులు నిలిపివేయడం జరిగిందని బాధితులు తెలిపారు. ఇదే అదునుగా భావించిన దూసి గ్రామానికి చెందిన బి.సి.ఎ సామాజిక వర్గానికి చెందిన 17 మంది. దళిత కుటుంబాలకు చెందిన డిపట్టా భూములను వారి జిరాయితీ భూములుగా చెప్పు కొస్తున్నారన్నారు. ఇప్పటికే వీరిపై అట్రాసిటీ కేసు సమోదు అయినప్పటికీ వీరిపై ఎటువంటి చర్యలు లేవు అన్నారు. వీరికి గ్రామ సర్పంచ్‌ల సహకారులుగా ఉన్నారన్నారు. దళితులకు ఇచ్చిన డి పట్టాలు తమ వద్దనే ఉన్నాయని దూసి గ్రామానికి చెందిన దళిత ప్రజలు ముక్తకంఠంతో తెలియజేశారు. ఇదిలా ఉండగా, ఈ విషయమై మార్చి నెలలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయగా ఏప్రిల్ నెలలో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఎమ్మార్వో, వీఆర్వోలు వచ్చారని తెలిపారు. అయినప్పటికీ బాధ్యులపై చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. వీఆర్వో స్థలాన్ని కొలిచి చూపించక పోగా, అండర్స్టాండ్మెంట్ ద్వారా హద్దులు చూపినట్లు వ్రాసుకుపోయారని, సంతకాలు చేయించుకున్నారని దళిత మహిళలు ఎడ్ల కళ్యాణి, బొంతల లత, ఎం. లక్ష్మీ, యారబాటి పార్వతి, కలివరపు శ్రీలత, యారబాటి రాములమ్మ, అన్ను లక్ష్మి, బొడ్డేపల్లి లక్ష్మీభవాని, బొడ్డేపల్లి లక్ష్మి, మన్యాల రామారావు పేర్కొన్నారు. న్యాయం చేయాలని కోరారు. ఈ పోరాటంపై అఖండ భారతీయ బహుజన సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.వి.ఆర్. సంఘీభావం తెలిపారు.

## అన్నాజీ కుటుంబాన్ని పలకరించిన పలువురు నాయకులు

**విశాలాంధ్ర-ఆమదాలవలస:** మాజీ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీ రావు మాతృమూర్తి సనపల రత్నాలమ్మ ఇటీవల మృతి చెందిన విషయం విధితమే. తన ఆత్మీయులు బంధువులు రాజకీయ ప్రముఖులు పలువురు అన్న జీరో కుటుంబాన్ని పరామర్శించి రత్నాలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ఆల్ ఇండియా బిసి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు రైల్వే కార్మిక నేత పప్పల రామ మోహన్ రావు, వాల్తేరు డివిజన్ డిప్యూటీ డివిజనల్ కోఆర్డినేటర్ యు చందన్ కుమార్, అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర నాయకులు బొడ్డేపల్లి దామోదరరావు, కె వి ఎస్ నాయుడు, తమ్మినేని రమణమూర్తి రాష్ట్ర చేనేత మరియు జౌళి శాఖ జాయింట్ డైరెక్టర్ కే కన్నబాబు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బగాతి కిషోర్ సి ఎస్ ఎన్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తాండ్ర సునీల్ తదితరులు అన్నాజీ రావు నివాసానికి వెళ్లి పరామర్శించి కుటుంబ సభ్యులకు వారి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు.

## రహదారిలో గోతులతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

**విశాలాంధ్ర-సంతబొమ్మాళి :** సంతబొమ్మాళి పాలేశ్వరస్వామి ఆలయం నుంచి సవరపేట అడ్డురోడ్డు వరకు సుమారు 2 కోలోమీటర్ల రోడ్డు పొడవునా గుంతలే పడి అధ్వానంగా మారింది. చినుకుపడితే చాలు రోడ్డు చెరువును తలపిస్తుంది. సంతబొమ్మాళి గ్రామ సచివాలయం నుంచి లక్ష్మి పురం అడ్డు రోడ్డు వరకు పాదచారులు కూడా నడవలేని దుస్థితి లో రహదారి మారింది. నిత్యం పోర్టు కోసం గ్రావెల్ తరలించేందుకు పదులు సంఖ్యలో భారీ టిప్పర్లు ఈ రహదారి వెంబడి తిరగడం పల్ల రోడ్డు ఆనవాలె లేకుండా పెద్ద పెద్ద గుంతలు పడి వాహన దారులకు ఇబ్బంది కరంగా మారింది.గత పాలకులు నిర్లక్ష్యం పోర్టు కోసం తిరిగే భారీ వాహనాలు వల్ల సంతబొమ్మాళి- రహదారి పూర్తిగా ధ్వంసం అయిందని చెప్పాలి. అడుగు కో గుంట పడిందంటే ఈ రోడ్డు పరిస్థితి ఎంత దారుణంగా తయారైందో అర్థం చేసుకోవచ్చు. ఎటు చూసిన గోతులుతో నిండి పోయి పాదచారులను సైతం నడవడం కష్టంగా మారింది, ఇక వాహదారులు పరిస్థితి అయితే నిత్యం పీట్లు చేయక తప్పడం లేదు. పాలేశ్వర స్వామి ఆలయం నుంచి సంతబొమ్మాళి వరకు ఈ రోడ్డు పరిస్థితి మరి దారుణంగా మారింది. గోదావరి పోలమ్మ తల్లి ఆలయం వద్ద, పోలీస్ స్టేషన్ ముందు, చిన్న కానాల వరకు రోడ్డు పూర్తి స్థాయిలో బాగుచేయడం దేవుడెరుగు కనీసం గుంతలు అయినా పుడ్చాండని స్థానికులు కోరుతున్నారు. ఇటీవల సంతబొమ్మాళి కోటబొమ్మాళి రహదారి కి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చేనాయుడు 2.5కోట్లు మంజూరు చేయించారు. ఈ మేరకు కోటబొమ్మాళి నుంచి లక్షపురం అడ్డు రోడ్డు వరకు పక్కా రహదారి నిర్మాణం జరిగింది. ఇక అక్కడ నుంచి సంతబొమ్మాళి పాలేశరస్వామి ఆలయం వరకు ఇంకా రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి రహదారి బాగు చేయాలని కోరుతున్నారు.

## పోషణ మాసం... ఆరోగ్య రక్షణే లక్ష్యం : ఐసిడిఎస్ సూపర్వైజర్ సంధ్యారాణి

**విశాలాంధ్ర-టెక్కలి:** పౌష్టిక ఆహారం ఆరోగ్యవంతమైన జీవనానికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ టి సంధ్యారాణి అన్నారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిని విద్య ఆదేశాల మేరకు మండలంలోని స్థానిక పెద్ద కంద్ర వీధి అంగనవాడి కేంద్రంలో మంగళవారం ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలలోని శిశువు ఎదుగుదల నుంచి శిశువు జన్మించే వరకు.. ఆ తరువాత పెరుగుతున్న పిల్లలకు తగినంత పౌష్టిక ఆహారం అందిస్తే ఎంతో మేలు చేకూరుతుందని, ఆరోగ్య సమస్యలు తలెత్తవని అన్నారు. గర్భిణీలు, బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలు, స్థూలకాయ నివారణ, చక్కెర మరియు నూనె వినియోగం గురించి అవగాహన కల్పించారు. మంచి ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని, పిల్లలకు జంక్ ఫుడ్ పరిచయం చేయకూడదని తెలిపారు. చక్కెర నూనె ఉప్పు మరికొన్ని పదార్థాలను స్వల్ప మోతాదులో తీసుకోవాలని సూచించారు. ఈ మధ్యకాలంలో ఎక్కువ మంది చిన్నారులు సెల్ఫోన్లకు ఎడిట్ అవుతున్నారని, సెల్ ఫోన్ నుండి దూరం చేసి ఆటలు, పాటలు, కథలు చెప్పే విధంగా ఇప్పటి నుండే చిన్నారులకు నేర్పించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు నంబల్ల శోభారాణి, ఉపాధ్యాయులు ఇంద్ర పాత్రో, సూపర్వైజర్ సరస్వతి, మహిళా పోలీస్ డి. కుమారి స్థానిక అంగన్వాడి కేంద్రాల కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి

**- కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో డా.దానేటి శ్రీధర్**

**విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్:** రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శ్రీకాకుళం సందర్శించిన సందర్భంగా జనసేన పార్టీ జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమావేశం నగర పరిధిలోని 80 ఫీట్ రోడ్డులో బృందావనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు డా.దానేటి శ్రీధర్ మాట్లాడుతూ గ్రామస్వరాజ్యం దిశగా జనసేన అడుగులు అన్ని పార్టీలకు స్ఫూర్తిదాయకమన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శ్రీకాకుళం రావటం కార్యకర్తలలో నూతనోత్సవం వచ్చిందని, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఒక ఎత్తైతే, మంత్రి నాదెండ్ల మనోహర్ మరొక ఎత్తని, ఈ రోజు మీ పాలనాతీరుని అన్ని రాష్ట్రాలు గమనిస్తూ, కొన్నిటిని అమలుపరుస్తుండటం గొప్ప విషయమన్నారు. అధినేత పవన్ కళ్యాణ్ ఆలోచన నిర్ణయాలు జనసైనికులకు ఆలోచింపజేస్తున్నాయని, వారిని అనుసరించి రానున్న కాలంలో ప్రతీ సైనికుడు, ఉత్తమ లీడర్ గా సేవలందిస్తారన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, జనసేన పార్టీ సిద్ధాంతాలను జనసైనికులు, వీరమహిళలు ప్రజలకు చేరువ చేస్తున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన బరిలో దిగి, శ్రీకాకుళంలో విజయకేతనం ఎగురవేస్తామని, ఇప్పటి నుండే అందుకు తగ్గ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, సుడా చైర్మన్ కె రవికుమార్, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్, శ్రీకాకుళం జనసేన పార్టీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు

**- మోడ్రన్ టెక్నాలజీతో ఆధునీకరణే కూటమి ప్రభుత్వ ముఖ్య లక్ష్యం**
**- ఎమ్మెల్యే పియుసి చైర్మన్ కూన రవికుమార్**

**విశాలాంధ్ర-ఆమదాలవలస:** నియోజకవర్గ పరిధిలోని గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ఆధునిక పరిజ్ఞానంతో వనరుల అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని ఆముదాల వలస ఎమ్మెల్యే పియుసి చైర్మన్ రవి కుమార్ అన్నారు. ఆది కర్మ యోగి అభియాన్ ఫేజ్-1 పథకం అమలులో భాగంగా బూర్జ మరియు సరుబుజ్జిలి మండలాల అధికారులతో పాటు ట్రైబల్ శాఖ అధికారులు, సచివాలయ సిబ్బందితో మంగళ వారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్డీఏ ప్రభుత్వం గిరిజన గ్రామాల అభివృద్ధికి రూపొందించిన పథకం పురోగ తిపై సమగ్రంగా విచారణ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి, విద్యా, వైద్యం మెరుగైన రవాణ సౌకర్యం ఉద్యోగావకాశాల పెంపు, మరియు ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందే విధంగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. పథకం అమలులో పారదర్శకత, సమయపాలన ముఖ్యమని సూ చించారు. ఆది కర్మయోగి అభియాన్ పథకం గిరిజన గ్రామాల అభివృద్ధికి ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్ప నకు రూపొందించినదని తెలిపారు. పథకాలపై సమగ్ర సమాచారంతో రూపొందించాలన్నారు. సమావేశంలో సంబంధిత విభాగాల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.